# ఈ వారం కథ

— సదానంద్ శారద

దుష్టులకు దూరంగా వుండాలన్న జాగ్రత్త నిజానికి దుష్టులకే ఉపయోగిస్తుంది. అలా అని అందరూ దుష్టులను ఎదిరించలేరు. నిస్సహాయ స్థితిలో వున్న వాళ్ళ సంగతైతే చెప్పనవసరం లేదు. దుర్మార్గం కొనసాగడమూ జరుగుతున్న కథే, దాన్ని ప్రతిఘటించడమూ జరుగుతున్న కథే.

## జరుగుతున్న కథ



**శ్యామల కళ్ళెత్తి భర్త మొహంలోకి చూసింది. చిప్పిల్లిన ఆమె కళ్ళను చూసి చలించి పోయాడు శేఖర్.**

"ఏమైంది శ్యామా?" అని అనునయంగా అడిగాడు.

దుమికే కన్నీళ్లను మునిపంట ఆపి ... రెండు వేళ్లతో కనుకొలుకులు అదిమిపట్టింది శ్యామల ...

ఆమెకు మరింత చేరువగా వెళ్లడానికి ... అవిటివాడైన శేఖర్ చేతికర్ర సహాయంతో కుర్చీ లోంచి లేవబోయాడు.

అది గమనించిన శ్యామల కంగారుగా తనే అతనికి దగ్గరగా వొచ్చి తిరిగి కుర్చీలో కూర్చో బెట్టింది.

అప్పుడు చిప్పిల్లిన ఆమె కళ్లు మరింతగా స్పష్టంగా కనిపించాయి శేఖర్‌కు.

ఆమె చేతిని తన గుండె మీద పెట్టుకుంటూ — "శ్యామా .... నీ మనసెందుకో గాయపడింది. ఏం జరిగిందో చెప్పకపోతే నేనెంత తల్లడిల్లిపోతానో అర్థం చేసుకోలేవా?...." అన్నాడు శేఖర్. ఆ మాటలు అంటున్నప్పుడు అతని గొంతు జీర పోయింది... కంఠం ఆర్ద్రంగా వొణికింది.

వెక్కి వెక్కి ఏడ్చేంతగా దుఃఖం పొంగుకొచ్చింది శ్యామలకు. కాని నిగ్రహించుకుంది. భర్త మనసు బాధపడడం ఆమె భరించలేదు. ముందుగా తనను తాను సంబాళించుకొని, ప్రశాంతంగా భర్తకు ఆ విషయం చెప్పాలి అనుకుంది —

యాక్సిడెంట్‌లో కాలు పోగొట్టుకొని ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు శేఖర్.

పూర్తిగా కోలుకున్నాక కూడా అతడు తిరిగి ఫ్యాక్టరీకి వెళ్ళే అవకాశం లేదు. శేఖర్ ఒక ప్రైవేట్ ఫ్యాక్టరీ కార్మికుడు. యాక్సిడెంట్ జరిగింది పనిచేస్తున్నప్పుడు కాదు. ఫ్యాక్టరీ ఆవరణలో కాదు. కనుక అతనికి నష్టపరిహారం రాదు. మరో తేలికపాటి ఉద్యోగమేదైనా ఆ ఫ్యాక్టరీలో దొరికే వీలు లేదు. ప్రభుత్వ రంగ సంస్థలే కఠినంగా గేట్లు మూసేస్తుంటే ... ఇక ప్రైవేట్

సంస్థలకు కార్మికుల పట్ల కనికరాలుంటాయా?

అందుకే ... తాను చేస్తున్న టీచర్ వుద్యోగానికి రాజీనామా చేస్తాను అన్నమాట నోటిదాకా వచ్చినా బయటికి అనలేకపోయింది శ్యామల.

అప్పుడప్పుడే బడికి వెళ్తున్న తమ పాప భవిష్యత్తు కూడా ఆమె కళ్లలో మెదిలింది.

తమ ప్రేమ వివాహాన్ని అంగీకరించని చిన్న మనసుగల ఇరువైపు పెద్దలు గుర్తుకొచ్చారు.

ఇక దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. భర్త ఛాతీపై తల వాల్చి వెక్కి వెక్కి ఏడ్చింది.

ఆమె తల నిమురుతున్న శేఖర్ కళ్లు కూడా చెమ్మగిల్లాయి.

ఏదో జరిగింది — చెప్పలేక ... ఆ బాధకు తట్టుకోలేక తనలో తానే కుమిలిపోతున్నది శ్యామల అని అర్థం చేసుకున్నాడు.

హైద్రాబాద్ పొలిమేరలో, రంగారెడ్డి జిల్లాలో వుంది బడి. రోజూ సిటీ బస్సులో బడికిపోయి వస్తుంది శ్యామల.

ఒకరోజు బస్సు దిగి వూరిలో అడుగుపెట్టింది — అప్పటికే పచ్చి కుండలా వుంది ఆకాశం. ఏ క్షణంలోనైనా కుండపోతగా వర్షం కురిసేట్టు వుంది. వడివడిగా స్కూలు వైపు నడుస్తోంది. ఆమె బడి ఆవరణలో అడుగుపెట్టగానే టప టప చినుకులు రాలసాగాయి. బ్యాగ్‌ను తలపై పెట్టుకొని స్టాఫ్ రూంకు పరుగెత్తింది.

అదే స్టాఫ్ రూం — అదే ఆఫీసు గది — అదే హెడ్‌మాస్టర్ గది — హెడ్మాస్టరంటూ ప్రత్యేకంగా ఆ బడికి ఇంకా ఎవరూ రాలేదు. ప్రభుత్వ పాఠశాలల పనితీరే వింతగా వుంటుంది. ఎక్కడలేని పొదుపు పాఠశాలల విషయం వచ్చేసరికే గుర్తుకొస్తుంది ప్రభుత్వానికి!

శ్యామలే సీనియర్ కనుక హెడ్‌మిస్ట్రెస్ బాధ్యత తనే నిర్వహిస్తోంది.

మొదటి పీరియడ్ మూడవ తరగతికి క్లాసు వుంది శ్యామలకు. వర్షం మూలంగా అప్పటికే పావుగంట ఆలస్యమయింది. రిజిస్టర్, డస్టర్, చాక్స్ తీసుకుని గబగబా క్లాసుకు వెళ్ళింది. తల మీద ముత్యాల్లా మెరుస్తున్న వర్షపు చుక్కల్ని ఆమె తుడుచుకోలేదు. మొహం మీది చెమట తుడుచుకోలేదు.

వరండాలోనే ఎదురయ్యారు ఆ తరగతి పిల్లలు. తరగతి గది మూసి వుంది. తాళం వేసి వుంది.

"అరరే — రామస్వామి ఏడీ? మీ క్లాసు తాళం తీయలేదా?" అని ఆదుర్దాగా అడిగింది శ్యామల.

## కొత్త సంవత్సరాది లో కోకిలమ్మ!

మధుర మంజుల గాన మా మావి నుండి
వచ్చి చేరగ నా గుండె విచ్చుకొనియె
అందజేసిన దెవ్వరో అమృత ఝురుల?
కొత్త సంవత్సరాదిలో కోకిలమ్మ

ఎండ దెబ్బకు నా శక్తి కొండజేరె,
అలసి నీడను జేరితి నంతలోనే
గొంతువిప్పి విశ్రాంతి నా గుండె కొసగె
కొత్త సంవత్సరాదిలో కోకిలమ్మ

వీణ, వయొలిన్, సితారలు వేణువులును
తలలు వంచెను సుమధుర గళము విప్ప
సాటి నీకెవ్వరీ రసజగతిలోన
కొత్త సంవత్సరాదిలో కోకిలమ్మ

నీదుగాన వర్షమ్ములో నీదులాడి
ఆమని యెడద సంగీత ధామమాయె
నమతులర్పింతునట్టి గానామృతముకు
కొత్త సంవత్సరాదిలో కోకిలమ్మ

డి.లక్ష్మణాచార్య

అప్పటికే వరండాలో నిల్చున్న ఆ పిల్లలు చలికి వొణికిపోతున్నారు. చివర నుంచున్న పిల్లల తలలు తడిశాయి.

ప్యూను రామస్వామి అక్కడే వున్నాడు.

"కాదమ్మా — తాళం చెవులు నా దగ్గర లేవు" అన్నాడు.

ఆశ్చర్యపోయింది శ్యామల.

"నీ దగ్గర లేవా? ఏమయ్యాయి?" అని అడిగింది.

చెప్పడానికి తటపటాయించాడు రామస్వామి. శ్యామల గద్దించి అడిగేసరికి — "సర్పంచ్ తీసుకున్నాడమ్మా" అని చెప్పాడు మెల్లగా.

"ఆయనెందుకు తీసుకుంటాడు!" మరింత ఆశ్చర్యపోయింది శ్యామల.

కొత్తగా ట్రాన్స్‌ఫరై వచ్చింది కనుక ఆ బడి వ్యవహారం పూర్తిగా ఆమెకింకా తెలియదు.

"అప్పుడప్పుడూ అలాగే తీసుకుంటారండీ" మీరేం పట్టించుకోకండి అన్నట్లు చెప్పింది తోటి టీచర్.

కానీ వర్షంలో తడుస్తూ ... పిల్లలు చలికి వొణికిపోతుంటే చూస్తూ వూర్కోలేకపోయింది శ్యామల.

"ఇది గవర్నమెంటు స్కూలు. ఆయన సొంత ఆస్తి కాదు. గొడుగు తీసుకొని తాళాలు అడుక్కురా" అని చెప్పింది రామస్వామితో.

"ఆయన జోలికి పోలేనమ్మా..." అనుభవజ్ఞుడైన రామస్వామి సలహా ఇచ్చాడు.

"జోలికి పోవడమేమిటి! స్కూలు గదిని తన సొంత ఆస్తిలా వాడుకుంటే చూస్తూ వూర్కోవాలా? అసలు స్కూలు గదితో ఆయనకేం పని?"...

జవాబు చెప్పలేదు రామస్వామి. తలవొంచుకున్నాడు.

"తాళాలు అడుక్కురమ్మన్నా కదా?....."

"పొద్దుగాల్నె వూరికిబోయిండు...." అని చెప్పాడు రామస్వామి.

శ్యామల ఆగ్రహంతో వొణికిపోయింది. ఆమె మొహం జేవురించింది.

"ఇక్కడ పిల్లలు చలికి వొణుకుతూ అవస్థ పడుతుంటే ... ఇది తన ఇల్లయినట్టు గదికి తాళం వేసుకొని వూరికి వెళ్ళిపోతాడా! ఈ స్కూల్ ఇన్‌చార్జ్ హెడ్‌గా నాకు విద్యార్థుల క్షేమం ముఖ్యం — ఆ తాళం పగులగొట్టు" అని ఆదేశించింది శ్యామల.

ఇక సలహాలు ఇవ్వడానికి భయపడ్డాడు రామస్వామి. ఆమె చెప్పినట్టు చేశాడు.

తాళం పగులగొట్టి తలుపులు తెరిచాడు.

ఆ గదిలోని దృశ్యాన్ని చూసి నివ్వెరపోయింది శ్యామల.

బెంచీలు దగ్గరికి వేసి వున్నాయి. వాడిపోయిన పూలు ... పగిలిన గాజుముక్కలు కనిపించాయి ...

కోపంతో శ్యామల మొహం మరింత కంది పోయింది .... ఆ మాత్రం స్పందనలేకపోతే ఆమె టీచరే కాదు.

ఆ గదిని శుభ్రం చేయించి ... పిల్లలను కూర్చోబెట్టింది.

ఊరి నుంచి తిరిగి వచ్చిన తరువాత సంగతి తెలిసిన సర్పంచ్ సర్పంలా బుసకొట్టాడు. 'పాము పగ' అని ఇలాంటి పాముల్ని చూసే అన్నారేమో!

శ్యామల అనే టీచర్ ఊరి రాజకీయాల్లో జోక్యం చేసుకుంటున్నదనీ, స్కూలుకు వారానికొకసారి వచ్చి సంతకంపెట్టి వెళ్ళిపోతున్నదనీ సర్పంచ్ విద్యాశాఖ అధికారులకు కంప్లెయింట్ ఇచ్చాడు. అంతటితో వూర్కోలేదు. ఆమెను బజారుకీడ్చాలనే వుద్దేశంతో ఆ కంప్లయింట్‌ని పత్రికలక్కూడా విడుదల చేశాడు.

ఆ సమాచారం పత్రికల్లో వచ్చింది. పై అధికారుల నుంచి శ్యామలకు సంజాయిషీ నోటీస్ కూడా అందింది. సర్పంచ్‌కు జడిసి నిజం చెప్పడానికి తోటి టీచర్లు కానీ, ప్యూను రామస్వామి కానీ ముందుకు రాలేదు.

శ్యామలను ఏకాకిని చేసి తీవ్ర మానసిక

ఆందోళనకు గురి చేశాడు సర్పంచ్.

రెండు రోజులుగా ఆ దిగులు గుట్టను ... ఆ అగ్ని పర్వతాన్ని తనలో తానే మోస్తూ కుమిలిపోతు న్నది శ్యామల. తాను చెప్పే నిజాన్ని వినిపించుకునే వారు లేరు. పట్టించుకునే వారు లేరు. అయినా ఆమె భయపడలేదు. నిజం చెప్పడానికి తోటి టీచర్లు ఒక్కరు కూడా ముందుకు రానందుకు బాధపడింది.

విషయం విన్న శేఖర్ విధి నిర్వహణలో ఆమె చూపిన ధైర్యానికి మెచ్చుకున్నాడు.

"నీ కర్తవ్యాన్ని నువ్వు నిర్వర్తించావు. గో ఎ హెడ్ శ్యామా — నీకిచ్చిన నోటీసుకు జవాబు రాసి స్వయంగా మీ ఆఫీసర్‌కు అందించు. జరి గింది జరిగినట్లు ఆయనకు వివరించు. ఒక్కోసారి ఆఫీసర్లలో మంచి ఆఫీసర్ వుండవచ్చు" అని భార్య వెన్ను తట్టి ఆమెను ప్రోత్సహించాడతను.

ఆ ప్రోత్సాహం, ఆ వెలుగు మాటలు ఆమె ఆవేదనా చీకట్లను తొలగించాయి.

తుపాను వెలిసింది.

ఆమె మనసు ఇప్పుడు ఎంతో ప్రశాంతంగా వుంది.

భర్త చెప్పినట్టుగా ఆమె స్వయంగా ఆఫీసర్‌కు జరిగింది వివరించాలని నిర్ణయించుకుంది.

ఆ రోజే ఆమె విద్యా శాఖ కార్యాలయా నికి వెళ్ళింది. అక్కడ వూహించని పరిణామం జరిగింది.

ఆఫీసర్ చెప్పిన విషయం విని ఆమె ఆశ్చ ర్యపోయింది.


సర్పంచ్ తన కంప్లెయింట్‌ను వాపసు తీసు కున్నాడట!

పాము వచ్చి విషాన్ని తిరిగి పీల్చేసుకోవడం నిజమేనా!!

స్కూల్లో అడుగుపెట్టిన తరువాత రామస్వామి చెబితేగాని తెలియలేదు శ్యామలకు. ఆ పాము చేత విషాన్ని వాపసు మింగించిన మంత్రగాళ్ళెవరో!!

"ఇంకోసారి స్కూలు వ్యవహారాల్లో తలదూర్చి .... వెధవ వేషాలు వేస్తే సర్పంచ్‌ను నరికేస్తా మని వాళ్ళు హెచ్చరించారట కూడా!!

ఆ మాటలు సంబరంగా ... ధైర్యంగా చెప్ప సాగాడు రామస్వామి..."




# మీదృష్టిలో...

## ● చిద్విలాసం అంటే?




* ఆఫీసరు నవ్వు!

— పి.సత్యనారాయణ, విశాఖపట్నం



* విలాసంగా జీవించుట

— ఎ.శ్రీనివాసరావు, ఖమ్మం




* 'జ్యోతి'లో నా ఫోటో చూస్తే కలిగే ఆనందం

—వి.రాంబాబు, తాటిపాక




* ఏదీ పట్టకపోవడం

— పి.మురళీరావు, హైదరాబాద్




* భార్య గర్భవతిగా అవస్థపడుతుంటే భర్త మగాడినని గర్వపడడం

—ఎస్.విశ్వనాథరాజు, గోదావరిఖని



* నెలాఖరున అవిలేవు ఇవిలేవు అన్నప్పుడు.

— ఎల్.ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప



* విచిత్రమైన మాయ

— పి.ఎస్.శివయ్య, కడప



* రెండుపూటలా అన్నం దొరకుట

— ముత్యాల వెంకట్, ఖమ్మం

* బడ్జెట్ చూసి నవ్వలేకపోవడం

—కొప్పర్తి జనార్దన్, బుచ్చిరెడ్డిపాలెం

* నన్ను పొగిడినపుడు పట్టలేని ఆనందంతో నేను చేసేది.

— నిమ్మగడ్డ కోమరి, గుణదల

* ఎన్నికయ్యాక పార్టీని వదలడం.

— పరిటాల రామారావు, ఏలూరు

* ఎంత సంపాయించినా ఆదాయంపన్ను కట్టకపోవడం

— అల్లాడి సత్యమ్మ, సుల్తాన్‌నగర్

◆ ఈ వారం ప్రశ్న! * ప్రయాణం అంటే?

పత్రిక మీ చేతికి అందిన వెంటనే ఈ ప్రశ్నకి మీ సమాధానంతో పాటు మీ ఫోటోను కూడా పంపిన యెడల ప్రచురించగలం.